
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 11 సెప్టెంబర్ 2024
5
తిరుపతి





జడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయుడు కోనేటి సురేష్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



సత్యవేడులో..



తిరుపతిలో...

మోడీ మెడలు వంచుదాం..!
'విశాఖ ఉక్కు'ను కాపాడుకుందాం..!!

కార్మిక, రైతుసంఘాల నిరసన హోరు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మోడీ మెడలు వంచుదాం.. విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుందాం' అంటూ కార్మిక,రైతు సంఘాలు హోరెత్తించాయి. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక సంఘాలు తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా నిరసనలు తెలిపాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి.

తిరుపతి అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాక్రిష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు, హేమలత, సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు పి.మురళి, వి.నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఎఐటియుసి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శులు ఎన్‌డి రవి, కె.వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్రంలో నరేంద్రమోడీ మెడలు వంచైనా సాధించుకోవాలని నినదించారు. 75 లక్షల సామర్థ్యం గల విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గత ఏడాది 45 లక్షల సామర్థ్యం చేసేలా మోడీ గనులను కేటాయించకుండా నష్టాల పాటు చేస్తున్నారన్నారు. బిఎస్ఎన్ఎల్ సహా విశాఖ ఉక్కు కార్మికులను తొలగించడం కోసం విఆర్ఎస్‌కు 1210 కోట్లు కేటాయించడమే నిదర్శనమన్నారు.

గూడూరు టౌన్‌లో.. టవర్‌క్లాక్ సెంటర్‌లో నిరసన తెలిపారు. నాయకులు జోగి శివకుమార్, పి.శ్రీనివాసులు, టి.వెంకటరామిరెడ్డి, బివి రమణయ్య, ఎస్.సురేష్ పాల్గొన్నారు. పుత్తూరు టౌన్‌లో.. అంబేద్కర్ సర్కిల్ వద్ద సిఐటియు,ఎఐటియుసి సంయుక్త ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆర్.వెంకటేష్, డి.మహేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ స్టీలు ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. పురుషోత్తం, ఎ.విజయ్, పి.భాస్కర్, వై.నందయ్య పాల్గొన్నారు. **శ్రీకాళహస్తిలో..** సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్లుగా కార్మికులు ఆందోళనలు చేపడుతున్నా కేంద్రానికి కనీసం చీమ కుట్టినట్లు లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడతామనీ, విశాఖ ఉక్కును దక్కించుకుంటామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను కార్పొరేట్లకు కట్టబెట్టడం, నష్టాల్లో, అప్పుల్లో కూరుకుపోయిన కార్పొరేట్ సంస్థలను దత్తత తీసుకోవడం మోడీ ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు. నాయకులు గురవయ్య, మురళి, వైఎస్ మణి, గంధం మణి, రావూరు సుబ్రమణ్యం, వెంకటేష్, వేణు పాల్గొన్నారు. **వరదయ్యపాళెంలో** ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు అంబాకం చిన్నిరాజ్, నాగార్జున, డి.సిద్దులయ్య, మునిరాజా పాల్గొన్నారు. **సూళ్లూరుపేటలో..** ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజాసంఘాల నాయకులు సుంకర అల్లెయ్య, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు బి.పద్మనాభయ్య, కె.రమణయ్య పాల్గొన్నారు. **రేణిగుంటలో...** సిడబ్ల్యుసి గోడౌన్ పాత ఎయిర్‌పోర్టు రోడ్డుపై హమాలీ కార్మికులతో రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లానాయకులు మునిరాజా మాట్లాడుతూ బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ స్టీలు ప్లాంట్ పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యిందన్నారు. నాయకులు కె.హరినాథ్, నరసింహారెడ్డి, శివ, నాగూర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సూళ్లూరుపేటలో..



గూడూరులో..

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాటలు : కలెక్టర్

'ప్రధాని స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా' లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాటలు వేసేలా 'ప్రధాని స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా'కు ఎంపికైన 40 పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. జడ్‌పిహెచ్‌ఎస్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కోనాటి సురేష్‌ను జిల్లా యంత్రాంగం తరపున సన్మానించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్‌తో కలిసి ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒలు, ఉప విద్యాధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. తిరుపతి జిల్లాలో ఎంపికైన 40 పాఠశాలలు బెస్ట్ ప్రాక్టీసెస్ అవలంబించాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రధానమంత్రి అవార్డు కొరకే కాకుండా విద్య బోధన లో ఒక కొత్త ఒరవడితో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేలా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం 66శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 34శాతం నిధులు అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం 2021-22 యు-డైస్ డేటా ఆధారంగా ఎంపిక చేయబడిందని తెలిపారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలలో ఆట స్థలాలు ఏర్పాటు, రసాయన శాస్త్ర ప్రయోగశాలల ఏర్పాటు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగం, అవలంబిస్తున్న బోధన విధానం, బాలిక విద్య, వారు పాఠశాల లో డ్రాప్ అవుట్ కాకుండా తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సమీక్షించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. డీఈఓ వివరిస్తూ మొదటి దశ కింద 9 సెకండరీ విద్యాలయాలలో, 14 సీనియర్ సెకండరీ విద్యాలయాలలో కలిపి మొత్తం 23 పాఠశాలల్లో పది కెమిస్ట్రీ ల్యాబ్ లకు ఒక్కొక్కటికి 15.58 లక్షల నిధులతో పనులు పురోగతిలో ఉన్నాయని, ఇరవై ఒక్క పాఠశాలలకు క్రీడా ప్రాంగణాలు అభివృద్ధికి ఒక్కొక్క పాఠశాలకు 5 లక్షల నిధులతో పనులు పురోగతిలో ఉన్నాయని, ఒకేషనల్ ఎడ్యుకేషన్ ను పాఠశాలల్లో అందిస్తూ చర్యలు తీసుకోవడం జరురగుతోందని తెలిపారు. జిల్లా పరిషత్ హై స్కూల్ రేణిగుంటలో వారు అమలు చేస్తున్న వినూత్న బోధనా పద్ధతులు, చేపడుతున్న కార్యక్రమాలు హెచ్‌ఎం వివరించారు. అలాగే వారి పాఠశాలల సంబంధించిన కార్యక్రమాలను సోషల్ మీడియాలో బెస్ట్ ప్రాక్టీస్ విధానాలు అప్లోడ్ చేయడం జరుగుతోందని తెలిపారు. అలాగే చిల్లకూరు తదితర పాఠశాలల హెచ్‌ఎం లు వివరించారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా జిల్లా పరిషత్ హై స్కూల్ ఊరందూరు శ్రీకాళహస్తి కి చెందిన సోషల్ స్టడీస్ టీచర్ కోనాటి సురేష్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు పొందిన గ్రహీతకు జిల్లా యంత్రాంగం నుండి కలెక్టర్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పిఎంశ్రీ శివ శంకర్, డిప్యూటీ విద్యాధికారులు శాంతి, ప్రభాకర్ రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

మనోబలంతో ఆత్మహత్యల నివారణ సాధ్యం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - క్యాంపస్



మనోబలంతోనే ఆత్మహత్యల నివారణ సాధ్యమని జిల్లా ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ యు శ్రీహరి పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం' సందర్భంగా స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానముల నిర్వహణలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో జాతీయ ఆరోగ్య మిషన్ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో జాతీయ మానసిక ఆరోగ్యం క్రింద కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్యల్లో మన దేశంలో పెరగడం ఆందోళన కలిగిస్తోందని, పరిస్థితి నానాటికి విషమించటానికి యువతలో మనో ధైర్యం క్షీణించటం, అవగాహన లేమి ప్రధాన కారణమని, విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవటంలో విఫలమైనప్పుడు, ప్రణాళికా బద్దంగా జీవన విధానం లేక అభద్రతాభావంతో మానసిక ఒత్తిడికి గురైనప్పుడు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థులు తరచూ తమ తల్లిదండ్రులు గురువులతో సంభాషిస్తే మానసిక ఉల్లాసం, ఊరట, ధైర్యం తో వుండగలరని తెలియజేశారు. ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మహత్యలకు ప్రధానకారణం తల్లిదండ్రులు నిర్దేశించిన విద్యా ప్రమాణాలు అందుకోలేకపోవడమేనని, కళాశాల విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, భావోద్రేక నియంత్రణలకు, కళాశాలలో ఆత్మహత్యల నివారణకు తీసుకుంటున్న చర్యలు గురించి వివరించారు. డా.ఎస్ఎన్. పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు తెలిస్తే స్నేహితులు, సహవిద్యార్థులు పసిగట్టి అధ్యాపకుల దృష్టికి తీసుకెళితే వారికి జీవితం మీద ఆశ కలిగించే స్ఫూర్తిదాయకమైన మాటలతో కౌన్సిలింగ్ ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి మరియు ఆత్మహత్యల నివారణకు సంబందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. బాబు రెడ్డి, వైద్య శాఖా అధికారి, డా. ఎ. ఎల్. క్రాంతి కుమార్ వైద్య అధికారి, అధ్యాపకులు డా. సి.ఎల్. చెన్నా రెడ్డి, డా. కె. వెంకట రమణమ్మ, డా. వి. ప్రసన్న లక్ష్మి, పి.జి. లావణ్య పాల్గొన్నారు.

ఎస్వీఎంసీలో అవగాహన సదస్సు

ఎస్ వి వైద్య కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం పైన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పిఏ చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య విద్యార్థుల్లో, ప్రజల్లో కలుగుతున్న భయాలు, ఆత్మహత్యల మీద తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు, మానసిక వైద్య నిపుణులతో తరచు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. నేటి నుంచి ప్రతిరోజూ ఒక్కో కార్యక్రమాన్ని వారం రోజులు నిర్వహించాలని, వైద్య విద్యార్థులకు ఈ ఆత్మహత్యల నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, కొన్ని వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తామని ఈ విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే కొంతమేరకు ఆత్మహత్యల్ని నివారించవచ్చునని మానసిక వైద్య విభాగ అధిపతి డాక్టర్ మల్లికార్జున్ రావు తెలిపారు.

విద్యార్థులు సాంఖ్యకశాస్త్రంలో పట్టు సాధించాలి : విసి

ప్రజాశక్తి - క్యాంపస్

విద్యార్థులు సాంఖ్యక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఉన్నతమైన అవకాశాలను అందిపుచ్చుకుంటూ పట్టు సాధించాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సాంఖ్యక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పద్మభూషణ్ ఆచార్య సిఆర్ రావు వారి తల్లిదండ్రులలు సిడి నాయుడు, ఆర్కాట్ లక్ష్మీకాంతమ్మ పేర్ల జ్ఞాపకార్థం ఆయన విభాగం తరపున రెండు లక్షల రూపాయలను అతిథి ఉపన్యాసం కొరకు వితరణ ఇచ్చారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లుగానే ఈ సంవత్సరమూ సెప్టెంబర్ 10వ తేదీన ఎస్వీయూ సెనేట్ హాల్లో మంగళవారం విభాగాధిపతి ఆచార్య బి. సరోజమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు సాంఖ్యక శాస్త్రం సబ్జెక్టులో పట్టు సాధించడం ద్వారా ఎన్నో ఉన్నతమైన అవకాశాలను అందుకోవచ్చు అన్నారు. ప్రొఫెసర్ సి ఆర్ రావు వర్సిటీలోని సాంఖ్యక శాస్త్ర విభాగానికి ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు మాట్లాడుతూ ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు. సాంఖ్యక శాస్త్రం చదివే విద్యార్థులకు ఎన్నో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని వాటిని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య తులసి రామకష్ణారెడ్డి మాట్లాడుతూ ఆచార్య సిఆర్ రావు దేశంలోనే గొప్ప సాంఖ్యక శాస్త్రవేత్త అని కొనియాడారు. ఆయన రూపొందించిన సాంఖ్యక శాస్త్ర మోడల్స్ ఎంతో పేరుగాంచాయన్నారు. ఆచార్య ఎం ఆర్ శ్రీనివాసన్ విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. వెంకటరమణారెడ్డి, ఆచార్య బాల సిద్ధమని, ఆచార్య జయసుబ్బారెడ్డి పాల్గొన్నారు.





జీవో 85ను వ్యతిరేకిస్తూ...
వైద్యసిబ్బంది నిరసన

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)

జీవో నంబర్ 85కు వ్యతిరేకంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా జిల్లావ్యాప్తంగా పిహెచ్‌సి సిబ్బంది నిరసనలు తెలిపారు. తిరుపతి జిల్లా పిచ్చాటూరు వైద్య సిబ్బంది మెడికల్ ఆఫీసర్స్‌కు మద్దతు తెలుపుతూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. డాక్టర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రజల కోసం కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవ చేసిన డాక్టర్లను ఆదరించాలన్నారు. కొంతమంది చెడ్డవారి వల్ల డాక్టర్ సేవ చేసే వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ ఆరోగ్య కేంద్రంలో నిరసన తెలిపారు. గత రెండునెలలుగా జీవో 85ను రద్దు చేయాలని వినతులు ఇచ్చినా స్పందన లేదన్నారు. ప్రతిరోజూ నిరసనలు తెలియజేస్తామని, 15న చలో విజయవాడ, 16 నుంచి నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభం అవుతుందన్నారు. బాలాయపల్లిలో డాక్టర్లు ప్రమీల, లిఖిత, లియోనా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

గౌరిపెద్ది సాహితీ సృజన అద్భుతం : స్విమ్స్ వీసీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించడంలో గౌరి పెద్ది రామసుబ్బశర్మ విశేష కషి చేశారని స్విమ్స్ విసి డాక్టర్ ఆర్.వి.కుమార్ చెప్పారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో మంగళవారం గౌరి పెద్ది రామసుబ్బశర్మ 102వ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ ఆర్ వి కుమార్ మాట్లాడుతూ, అద్భుతమైన సాహితీ సజన చేసిన ప్రముఖులలో గౌరి పెద్ది ఒకరని అన్నారు. గౌరి పెద్దివారి సాహితీ వైభవం, నవ చండి సంప్రదాయం - వైదికత గురించి తెలిపారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు 27 సంపుటలు పరిష్కరించడంలో గౌరి పెద్ది వారు విశేష కషి చేశారన్నారు. వైద్యానికి, ఉపాసనకు గల సంబంధాన్ని వివరించారు. ఎస్వీయు విశ్రాంత ఆచార్యులు డాక్టర్ సర్వోత్తమరావు మాట్లాడుతూ నేటి తరం వారు తమ కంటే ముందున్న గొప్ప తరాన్ని గురించి తెలుసుకోవాలన్నారు. ద్రోణాచలంకు చెందిన ప్రముఖ శతవధాని అవధాని సరస్వతి డాక్టర్ గండ్లూరి దత్తాత్రేయ శర్మ, అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు విభీషణ శర్మ పాల్గొన్నారు.

లాయల్ టెక్స్‌టైల్ లాకౌట్ అన్యాయం
సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - నాయుడుపేట

మండలంలోని మేనకూరు ఎస్సీ జడ్ లాయల్ టెక్స్‌టైల్ పరిశ్రమ లాకౌట్ విధించడం అన్యాయమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య అన్నారు. ఉన్నపళంగా లాకౌట్ ప్రకటించి కార్మికులను వీధుల్లోకి నెట్టడంతో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ విషయమై గతంలో శుక్రవారం నాయుడుపేట తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించగా ఎసిఎల్, డిసిఎల్‌తో సంప్రదించి సోమవారం సంప్రదింపులు జరుపుతామని చెప్పడంతో ధర్నాను విరమించారు. అయితే అధికారుల నుంచి ఎటువంటి చర్చలు లేకపోవడంతో మంగళవారం టెక్స్‌టైల్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో డిసిఎల్, ఎసిఎల్ లాయల్ పరిశ్రమ వద్దకు రావడంతో కార్మికులు మధ్యాహ్నం భోజనం చేయకుండానే సంప్రదింపుల్లో పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు యాజమాన్యానికి, కార్మికులకు మధ్య సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. అయితే యాజమాన్యం లేబర్ డిపార్టుమెంట్ సూచన మేరకు మేనేజ్‌మెంట్ బోర్డులో చర్చించుకుని గురువారం ఏ విషయం తెలియజేస్తామని చెప్పారు. అనంతరం అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ లాయల్ టెక్స్‌టైల్ పరిశ్రమ యాజమాన్యం చట్టవిరుద్ధంగా లాకౌట్ చేసే ముందు కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని, కార్మికుల కష్టాన్ని సొమ్ము చేసుకుని, ఇతర రాష్ట్రాలలో వ్యాపారం పెంచుకుని నష్టాల పేరుతో లాకప్ ప్రకటించడం అన్యాయమన్నారు. ఎసిఎల్, డిసిఎల్ సహకారంతో కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుంద, గురవయ్య, విజయ్‌కుమార్, జయచంద్ర, శివ, దీప, రత్నమ్మ, సీనయ్య, గురవయ్య పాల్గొన్నారు.



యోగాసనాల్లో మహిళా వర్సిటీ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్

సెప్టెంబర్ నెల చివరి వారంలో జరగబోయే రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలకు ఈనెల 9వ తేదీ సోమవారం తిరుపతి ఎస్వి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన జిల్లా స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలు జరిగాయి. సీనియర్ గ్రూప్ 18 నుంచి 28 సంవత్సరాల వయసులో ఎం.విజయదుర్గ, యం. త్రివేణి, జి సి వర్షిత బ్రాంచ్ మెడల్ సిఎస్సి నాలుగో సంవత్సరం , కే కావ్య శ్రీ, అలేఖ్య, సీనియర్ గ్రూప్ ఏ 28 నుంచి 35 సంవత్సరాల విభాగంలో డి.రేవతి, సి.లావణ్య, ఎం.వి. గౌతమి, సీనియర్ గ్రూప్ బి 35 నుంచి 45 సంవత్సరాల వయసులో డాక్టర్ డి. స్రవంతి, జే.ధనలక్ష్మి లు ఎంపిక అయినట్లు వర్సిటీ వ్యాయామ విభాగాధిపతి ప్రొఫెసర్ జి సారా సరోజినీ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను వర్సిటీ విసి ఆచార్య వన్నెం ఉమ, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఏన్. రజిని అభినందించారు.

బాలాజీ నగర్‌లోనే ఇళ్లు కేటాయించాలి: ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్


స్థానికులకు బాలాజీనగర్‌లోనే ఇళ్లు కేటాయించాలని తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు కోరారు. టీటీడీ ఈవో శ్యామలరావుతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం మధ్యాహ్నం టిటిడి పరిపాలనా భవనంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఈఓ శ్యామలరావుకు స్థానికుల సమస్యల పై వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా తిరుమలలోని పూటకూళ్ళమిట్ట, సతురామ్ మఠానికి చెందిన 84 కుటుంబాలు ప్రస్తుతం రిహబిలిటేషన్ సెంటర్ లో నివాసం ఉంటున్నారు. వీరికి బాలాజీ నగర్ లో ఇళ్ళు కేటాయించాలని ఈఓను ఎమ్మెల్యే కోరారు. మరోవైపు టిటిడి విద్యాసంస్థల్లో పని చేస్తున్న టీచర్లకు హెల్త్ కార్డులు మంజూరు అంశం ఈఓ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్ళారు. ఈఓ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు .

శ్రీవారిమెట్టు వ్యాపారుల సమస్యలు పరిష్కరించండి

టిటిడి ఈవోకు సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగా 21 రోజులుగా నిరసన దీక్షలు కొనసాగిస్తున్న శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. నాగరాజు, టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు టి. సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్రలు టీటీడీ ఇఒకు విజ్ఞప్తి చేశారు. టీటీడీ ఇఒ శ్యామలరావును సిఐటియు నేతలు మంగళవారం ఉదయం కలిసి శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలను ప్రస్తావించారు. శ్రీవారి మెట్టు నడకదారిలో భక్తులకు గత 26 ఏళ్లుగా సేవలందిస్తున్న చిరు వ్యాపారుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి సమంజసంగా లేదని, పేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అలిపిరి నడకదారిలో పులి కనపడితే శ్రీవారి మెట్టు నడకదారిలో వ్యాపారాలను నిషేధించటం... ఏమి న్యాయమని ప్రశ్నించారు. ఎర్రచందనం స్మగ్లర్లను 164 మందిని పలు దఫాలలో పట్టించారని, అడవులు తగలబడి పోతుంటే ఆర్పడానికి ప్రయత్నించారని, భక్తులకు అనారోగ్య పరిస్థితులు ఎదురైనప్పుడు కాపాడారని గుర్తు చేశారు. సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు టీటీడీ అండగా నిలబడాల్సిన ఆవశ్యకత ఉందని వారు వివరించారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలను కూలంకషంగా పరిశీలిస్తున్నామని తప్పక న్యాయం చేస్తామని టీటీడీ ఇఓ శ్యామలరావు నేతలకు హామీ ఇచ్చారు.



22వ రోజు నిరసన దీక్షకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సంఘీభావం ప్రకటించారు. టిటిడి పరిపాలనా భవనం ఎదుట మంగళవారం వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని చేతుల్లో పట్టుకుని వంటినిండా నామాలు పెట్టుకుని గోవిందా అంటూ శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు వినూత్నంగా నిరసన తెలిపారు.

హిందీ గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీ హిందీ లెక్చరర్ పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ లెక్చరర్‌గా తీసుకోవాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చిందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గుండ్రాలు నాగరాణి మంగళవారం పేర్కొన్నారు. అభ్యర్థి హిందీ సబ్జెక్టులో యాభై శాతం మార్కులు ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, అన్ని సర్టిఫికెట్లతో అర్హులై ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాల పని వేళల్లో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు


విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లి హైస్కూలు విద్యార్థులకు మంగళవారం వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 14వ తేదీ హిందీ దినోత్సవం రోజు బహుమతులు అందిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి భారతి తెలిపారు. ఈ పోటీలను గొల్లపల్లి హైస్కూలు హిందీ ఉపాధ్యాయులు ఎన్ శ్రీరాములు, జి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.

మురుగు కాలువలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు లోని వెంకటగిరి మార్గంలోని షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా మురుగు కాలువలో వున్న చెత్తాచెదారం తొలగింపు పనులు ఏర్పేడు సర్పంచ్ సత్య పాలెం శివయ్య మంగళవారం చేపట్టారు. స్థానికులు, దుకాణ యజమానులు మురుగు కాలువలో చెత్త చెదారం వేయకుండా పారిశుధ్య కార్మికులకు చెత్తను అప్పగించాలని దీని ప్రభావం వల్ల వ్యాధుల వ్యాప్తిని నిరోధించవచ్చని తెలిపారు.

సబ్సిడీ ఉలవ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలానికి ప్రభుత్వం 85 క్వింటాళ్ల సబ్సిడీ ఉలవ విత్తనాలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి భారత్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ ఉలవ విత్తనాలు కావలసిన రైతులు స్థానిక రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి డాక్యుమెంట్ పన్ బి, ఆధార్, ద్వారా బయోమెట్రిక్ వేసి సబ్సిడీ విత్తనాలు పొందాలని ఏవో పేర్కొన్నారు. ఒక క్వింటాలు పూర్తి ధర రూ. 8,700 కాగా 80 శాతం సబ్సిడీ పోను ఒక క్వింటాకు రూ.1,740 చెల్లించి సబ్సిడీ ఉలవ విత్తనాలు పొందాలని పేర్కొన్నారు.

శ్రీనివాస్ మృతి బాధాకరం: టిడిపి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం, చోడవరం గ్రామ పంచాయతీకి చెందిన టిడిపి కార్యకర్త వంకాయల శ్రీనివాసయాదవ్ గుండె నొప్పి తో అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమని ఆ పార్టీ మండల అధ్యక్షులు గాలి మురళీ నాయుడు అన్నారు. శ్రీనివాస్ యాదవ్ భౌతిక కాయానికి మంగళవారం మురళీ నాయుడు నివాళి అర్పించారు. శ్రీనివాస్ టిడిపికి చేసిన సేవలు వెలకట్టలేనివని ఆయన కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ వైస్ ఎంపీపీ చోడవరం చంద్రారెడ్డి, బీసీ సెల్ నాయకుడు సురేంద్ర యాదవ్, తాతయ్య, ఎర్రయ్య, గురునాధం పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి: సిడిపిఒ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని స్త్రీ సంక్షేమ శాఖ సిడిపిఒ శంషాద్ బేగం పేర్కొన్నారు. మంగళవారం బాలాయపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పోషక ఆహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6వ నెల నుంచి గర్భవతులు ప్రతి నెల వైద్య సలహాలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న టీకాలు వేయించుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని తెలిపారు. గర్భిణులుగా ఉన్న సమయంలో పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య వంతమైన బిడ్డ పుడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి ప్రమీల, లియోనా, అంగన్‌వాడీ కార్యకర్త లు, గర్భిణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు .

పుత్తూరు టౌన్ : అంగన్‌వాడీల మాసోత్సవాలలో భాగంగా వడమాలపేట మండలం, యస్‌బిఆర్ పురం అంగన్‌వాడీ కేంద్రంలో జయలక్ష్మి మాట్లాడుతూ తల్లులకు, పిల్లలకు తల్లి చేతి వంటకం ద్వారా మరిన్ని పోషకాహారాలు మాత్రమే కాక రుచికరమైన ఆహారాలు, పోషక విలువలతో కూడిన ఆహారాలను ఎలాగ తయారు చేయాలో భాగస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. రాగిపిండి, ఆకుకూరలతో పకోడి , రాగిపిండి లడ్డు, బాలామృతం కుడుములను అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా తయారు చేయించి చూపించారు. తృణ ధాన్యాలను, ఆకుకూరలను ఆహారంలో ప్రతి రోజూ చేర్చి తినాలని అంగన్‌వాడీల సేవలను అందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపివో పద్మజ, సూపరవైజరు రోజా రమణి, పంచాయతీ సెక్రటరీ జ్యోత్స్నదేవి, జిఎంఎస్‌కె మహేశ్వరి, ఎఎన్ఎం కల్పన, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాతమ్మ,లక్ష్మీదేవి, జయలక్ష్మి, హెల్పర్లు , గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

వరద ప్రాంత కష్టమర్లకు బజాజ్ ఇన్సూరెన్స్ సాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వరదలు ప్రజా జీవనానికి, ఆస్తికి అపార నష్టాన్ని కలిగించాయి, రెండు తెలుగు రాష్ట్రాల్లోని వరద ప్రభావం వల్ల నష్టపోయిన తమ వినియోగదారులకు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ సత్వర సాయం అందించనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఈ క్లిష్ట సమయాల్లో తన కష్టమర్లు తిరిగి కోలుకోవడానికి సకాలంలో, సమర్థవంతమైన క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను అందించి వారి పక్క తమ నిబద్ధతను తెలుపుతున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బజాజ్ అలియంజ్‌తో పాటు ఇన్సూరెన్స్ పరిశ్రమ పోరుకు, ప్రత్యేకించి సంక్లిష్ట సమయాల్లో, సేవలు అందించడానికి అంకితం అయినట్లు తెలిపారు. కష్టమర్లకు సహాయం చేయడానికి, కంపెనీ వేగవంతమైన సమర్థవంతమైన మద్దతును అందించడానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. కష్టమర్ ప్రశ్నలకు సమాధానాలు అందించడానికి ఒక ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. అవాంతరాలు లేకుండా క్లెయిమ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారని తెలిపారు. కస్టమర్ సపోర్ట్ కోసం అత్యవసర టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ 1800 209 7072 నెంబరును ఏర్పాటు చేశామని దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా రాజగణపతి హోమం

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట జీవం స్ట్రీట్‌లో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదురోజులు పాటు నిర్వహిస్తున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం ఉదయం వినాయకుని మండపం ముందు అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్ దంపతులు చేతుల మీదుగా అర్చకులు శ్రీ రామచంద్ర విజయ్ స్వామి శాస్త్రోక్తంగా రాజ గణపతి హోమం నిర్వహించారు. అర్బన్ సీఐ శరత్ చంద్ర, టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, కన్నా రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. అతిథులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. మధ్యాహ్నం జూలియన్ రాజు తనయుడు అనిల్, సుమశ్రీ దంపతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 700 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, కమిటీ సభ్యులు సుబ్బు, దినేష్, సుమన్, పవన్, కళ్యాణ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

వీధులన్నీ బురదమయం

రాకపోకలకు ఇబ్బంది

ప్రజాశక్తి -కోట : ఇటీవల కురుస్తున్న తేలిక పాటి వర్షాలకు కోట మండలం తిన్నెలపూడి పంచాయతీలో వీధులన్నీ బురద మయంగా మారాయి. తిన్నెలపూడి దళితవాడలో వీధులు గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు చేరి బురదగా మారి గ్రామ ప్రజలు నడవ డానికి నానా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. దీనికి తోడు వీధుల్లోనే పేడ దిబ్బలు వేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు అపరిశుభ్రత కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం వుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ సర్పంచ్, పంచాయతీ అధికారులు స్పందించి వీధులను శుభ్రం చేసి గ్రామస్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


బురదమయంగా మారిన వీధులు

క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు


క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి- రామచంద్రాపురం: తిరుపతి రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల సౌకర్యార్థం టాటా ట్రస్ట్ సహకారంతో తిరుపతి రూరల్ మండలం సి మల్లవరం సచివాలయం ప్రాంగణంలో మంగళవారం క్యాన్సర్ పై అవగాహన, నిర్ధారణ పరీక్షలను సర్పంచ్ మొక్కల భారతి, ఉప సర్పంచ్ షహనాజ్, ప్రాజెక్టు డైరెక్టర్ వి నాగరాజు మంగళవారం ప్రారంభించారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ప్రాజెక్ట్ డైరెక్టర్ వి నాగరాజు మాట్లాడుతూ మహిళలు బరువు తగ్గడం, జ్వరం వస్తుండడం, దగ్గు వస్తుండడం, నిరంతరం తలనొప్పి, మూత్రనాళంలో రక్తం రావడం, నీరసంగా ఉండడం వంటి కారణాలు వస్తున్నప్పుడు డాక్టర్‌ని సంప్రదించి వారి సలహాలు, సూచనలు మేరకు మందులు వాడాలన్నారు. ఇలాంటి వైద్య క్యాంపుల ద్వారా మహిళలు ముందుకొచ్చి అధైర్య పడకుండా అవగాహన పెంచుకొని నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. సి మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి మాట్లాడుతూ రాస్ సంస్థ మహిళల కోసం తమ గ్రామానికి వైద్య బృందాన్ని తీసుకువచ్చి మహిళలందరికీ క్యాన్సర్ పై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం వైద్యులు వెంకయ్య బాబు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి వైద్య సేవలు పొందితే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్ షహనాజ్, రాస్ సిబ్బంది నాగేశ్వరరావు, నాగరాజు, నీలమ్మ, సులోచనమ్మ, షాహిన, 150 మంది మహిళలు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో బిసిలకు ప్రాధాన్యత ఇవ్వండి

ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణ గౌడ్

ప్రజాశక్తి - క్యాంపస్ : స్విమ్స్ ఆస్పత్రిలో వివిధ పదవులలో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని ఏపీ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పరుచూరి నారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్విమ్స్ డైరెక్టర్, ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నారాయణ గౌడ్ మాట్లాడుతూ రాయలసీమకే తలమానికమై నిత్యం వందలాది మంది రోగులకు వైద్య సదుపాయాలు కల్పిస్తున్న స్విమ్స్ భారత దేశంలో గొప్ప పేరు ప్రఖ్యాతలు కలిగి వుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన పదవులలో బిసిలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, స్విమ్స్ పరిపాలన పదవులలో బిసి ప్రొఫెసర్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్విమ్స్ పరిపాలనలో కీలకమైన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, డీన్, మెడికల్ సూపరింటెండెంటు, ప్రిన్సిపాల్స్‌గా బిసి ప్రొఫెసర్లు లేకపోవడం బాధాకరమన్నారు. ఏడాది పాటు ఖాళీగా ఉన్న బీసీ లైజాన్ అధికారిని త్వరగా నియమించాలని డిమాండ్ చేశారు.


స్విమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నారాయణగౌడ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఒకేచోట కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఎన్నో ఏళ్ల తరువాత అదేచోట కలిశారు. గూడూరు పట్టణంలోని చర్చి వీధిలో ఏర్పాటైన జీఎంయుపి పాఠశాలలో 1986-87లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయంగా కలిశారు. ఎవరెవరు ఎక్కడ ఉన్నారో..వారి స్థితిగతులు, ఉద్యోగాలు, వ్యాపారాలు వంటి వాటిని స్నేహితులు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ నేపథ్యాలూ తెలుసుకుని ఉల్లాసంగా గడిపారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు కూడా పాఠశాలకు చేరుకుని గత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలిసి విద్యార్థులకు విద్యాసామగ్రి, భోజన ప్లేట్లు, అవసరమైన కుర్చీలు తమ వంతుగా అందించారు. అప్పటి ప్రధానోపాధ్యాయు రాలు మేరీ శ్యామ సుందరి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డిలను వారు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒకే చోట సమావేశమైన పూర్వ విద్యార్థులు

వరద బాధితులను ఆదుకోండి..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విజయవాడ వరద ప్రాంతాల్లో ప్రజలు ఇంకా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి తమ వంతుగా సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గూడూరు సాయి సత్సంగ నిలయం నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ పిలుపు నిచ్చారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం గూడూరు పట్టణంలో సాయి సత్సంగ నిలయం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. గూడూరు పట్టణంలో అనేక దుకాణాల వద్దకు వెళ్లి వారి వంతుగా సహాయం అందించాలని కోరారు. వ్యాపారులు, ప్రజలు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య ,గుబ్బా చంద్రశేఖర్ ,శ్రీధర్ ,కిషోర్ రెడ్డి,జయ, వంశీ పాల్గొన్నారు .


ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్న దృశ్యం


గూడూరు టౌన్ : విజయవాడ వరద బాధితుల సహాయక చర్యలలో భాగంగా విజయవాడ హౌసింగ్ బోర్డు కాలనీలో తన సొంత నిధులు 5 లక్షల రూపాయలతో బాధితులకు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్, సంధ్యారాణి దంపతులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్, సంధ్యారాణి మాట్లాడుతూ వరదల వల్ల ఇక్కడ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇక్కడి పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని, ఇళ్లలోకి నీరు వచ్చి తినడానికి తిండి, ఉండటానికి వసతులు లేవన్నారు. సమర్థవంతమైన సిఎం రాత్రింబవళ్లు అందరిని అప్రమత్తం చేసి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. సహాయక చర్యలలో భాగంగా స్థానికులకు సరుకులు, దుప్పట్లు తమ వంతు తాముగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టమూరు మండల పార్టీ అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు, ఈశంశెట్టి నటశేఖర్, యువత ప్రణీత్ యాదవ్, ఓం ప్రకాష్, మల్లి కళ్యాణ్, వేముల సునీల్, గుండాల సందీప్, అల్లం సాయి పాల్గొన్నారు.


కలెక్టర్‌కు చెక్కును అందిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌వో

శ్రీకాళహస్తి: విజయవాడ వరద ప్రాంతాల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సహాయక చర్యల్లో పాల్గొ న్నారు. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతంలో 64వ వార్డు ఇన్‌ఛార్జిగా నియ మించింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల సోమవారం నుంచి వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటించి ముంపు బాధితులకు సాయం చేస్తున్నారు. మంగళవారం కూడా ఆయన మంత్రి లోకేష్‌తో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ప్రజాశక్తి తిరుపతి సిటీ: ప్రముఖ వ్యాపార వేత్తలు కొట్టే బ్రదర్స్ విజయవాడ వరద బాధితుల సహాయార్థం లక్షా నూట పదహారు రూపాయల విరాళాన్ని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు అందించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాసం వద్ద కొట్టే బ్రదర్స్ రాజగోపాల్, భాస్కర్‌లు మంగళవారం ఉద యం ఈ మేరకు విరాళం చెక్కును అందించారు. త్వరలో ముఖ్యమంత్రి సహాయనిధికి ఈ చెక్‌ను అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా దాతలు ఆయనను అభినందించారు.

శ్రీకాళహస్తి: విజయవాడ వరద బాధితుల కోసం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే రూ.75 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం అందించారు. వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ. 2 కోట్ల మేర విరాళాలు అందివ్వనున్నట్లు ఇటీవల ఎమ్మెల్యే హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఆయన రూ.75 లక్షల చెక్కును నేరుగా సీఎం చేతికి అందించారు.


సిఎం సహాయ నిధికి 70 లక్షల రూపాయల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

తిరుపతి సిటీ: విజయవాడ వరద బాధితులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తన వంతు సాయంగా రూ.25 వేలు చెక్కును కలెక్టర్ వెంకటేశ్వర్‌కు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు విజయవాడ ప్రజలు అన్ని విధాల నష్టపోవడం చాలా బాధాకరం అన్నారు. తీవ్రంగా నష్టపోయిన విజయవాడ ప్రజలకు తమ వంతు సహాయంగా తన జీతం నుంచి రూ.25వేల రూపాయలు అందించానని తెలిపారు. ఈ మేరకు కలెక్టర్‌కు చెక్కును అందించారు.

సిఐకి ఘన సన్మానం


సిఐ సురేంద్రనాయుడిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన కెవి. సురేంద్ర నాయుడును పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి, పుత్తూరు పట్టణంలో ప్రజల ప్రశాంతతను కాపాడటంలో, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో సిఐ తనదైన శైలి చూపిస్తారని టిడిపి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ టిడిపి, కౌన్సిలర్ కేశవాచారి, మాజీ కౌన్సిలర్ ప్రసాద్ నాయుడు, ఐటిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి గోపీనాథ్, టిడిపి నాయకులు బిఆర్ మురళీకృష్ణ, నర్రా జయచంద్రా, విక్కీ రాయల్, ఈశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

'నీటి నిల్వలే జ్వరాలకు మూలం'

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: నీటి నిల్వలే జ్వరాలకు మూలమని ఆరోగ్యాధికారి డిఎన్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల ఆధ్వర్యంలో కాటూరు యానాది కాలనీలో జ్వరాల నివారణ, దోమల నిరోధంపై వైద్యాధికారి డిఎన్ వెంకటేశ్వర్లు మంగళవారం అవగాహన కల్పించారు. మనం ఇంటిలో వాడుకునే నీళ్లు, వర్షపు నీళ్లు నాలుగు రోజులు కన్నా మించి నిల్వ ఉంటే అందులో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి, బోధకాలు వ్యాధిని వ్యాపింప చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేను పాటించడం ద్వారా ఇంట్లో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చున్నారు. ప్రతిరోజూ వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు.

ఆరోపణలపై దర్యాప్తు చేపట్టండి..

పోలీసులకు దళితుల వినతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నేతలు, మహిళలు మంగళవారం ధర్నా చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన వారిపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాన్ని బహిర్గతం చేసి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు, నాగలాపురం టిడిపి సీనియర్ నాయకుడు మల్లికార్జున రెడ్డి, సెల్వ కుమార్, ఎస్ ఎమ్ సురేష్, నెల్సన్ మండేలా, ఢిల్లీ బాబు, మురళి, పార్థిబన్, బిఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధనుంజయులు, వైసిపి నాయకుడు గజేంద్ర, చంద్ర, టిడిపి నాయకులు శేషాద్రి, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, రజని, రవి, నాగరాజు, రుకేష్, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవర్క్ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని రాష్ట్రీయ సేవాసమితి రాస్ పొదుపు సంఘాల సభ్యులకు ఆర్య వర్క్‌కు అవసరమైన పరికరాలు, దారాలు, సూదులు, పూసలు, అద్దాలు, డిజైనింగ్ సామగ్రిని మంగళవారం ఉచితంగా అందించారు. ఆర్థికాభివృద్ధి మెరుగు పరిచేందుకు వృత్తి శిక్షణలో భాగంగా రాచపాళెంలో వారం రోజుల పాటూ ఆర్యవర్క్ శిక్షణ ఇచ్చారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, నాగరాజు ఆదేశాల మేరకు వారికి అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించారు. 20 మంది మహిళలకు ఆర్థిక వనరులపై ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా జన్ సంస్థాన్ కో ఆర్డినేటర్ శ్రీహరి మాట్లాడుతూ దైనందిన జీవితంలో మహిళలు విరామ సమయంలో చేతి వృత్తులపై మక్కువ చూపాలని, సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను ఆర్థిక కార్యక్రమాలకు వెచ్చించాలన్నారు. తర్వాత వచ్చిన ఆదాయాన్ని పిల్లలకు మంచి విద్య, ఆరోగ్యంపై వెచ్చించాలని, భర్తలకు సహాయకారిగా ఉపయోగ పడుతుందని తెలిపారు. సామాజిక కార్యకర్త రత్నకుమారి ప్రతాప్ రాజు మాట్లాడుతూ రాస్ సంఘాలు ఆదర్శవంతంగా వున్నాయని, వాటి సేవ చేయూత నిస్తాయని తెలిపారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాస్ అధికారి రవి, ప్రకాష్, దుర్గ, రజని పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: రాస్ సేవా సమితి రాస్ మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యం నేడు నారాయణవనం మండలం సముదాయం గ్రామంలో సచివాలయం నందు ఉదయం కుట్టుమిషన్ల పంపిణీ చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం నాగరాజు ఆదేశాల ఆదేశాలకు జన్ శిక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఏడు రోజులుగా స్థానిక సముదాయం సచివాలయంలో ఎంబ్రాయిడింగ్ వర్క్ పై ఉచిత శిక్షణను అందిస్తున్నారు. ఈ సందర్భంగా తొమ్మిది కుట్టు మిషన్లను సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి చేతుల మీదగా అందించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాస్ కార్యక్రమాలు ఆదర్శవంతగా వున్నాయని మహిళలు వీరమ సమయంలో చేతి వృత్తుల పట్ల ఆశక్తి పెంచుకుని వృత్తి శిక్షణలో తీసుకోవాలని తద్వారా తీసుకున్న రుణాలను ఆర్థిక కార్యక్రమాలకు వెచ్చించాలని సూచించారు. గ్రామంలో కొందరిని ఎంపిక చేసివారికి రాస్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో 50 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాస్ అధికారులు హరి, రవి, ముని రత్నమ్మ, మాలిని పాల్గొన్నారు.

జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి: ఎస్ఐ

ప్రజాశక్తి - రామచంద్రాపురం: యువత ఏదైనా సంఘటన చోటు చేసుకున్నప్పుడు సంయమనం పాటించాలని, కష్టాలు ప్రతి ఒక్కరికీ వస్తుంటాయని వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే విజేతలుగా నిలుస్తారని రామచంద్రా పురం ఎస్ఐ ఇ. రామాంజ నేయులు తెలిపారు. రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫాం కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ సుసైడ్ నివారణ దినోత్సవం పై అవగాహనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామచంద్రాపురం ఎస్ఐ ఇ. రామాంజనేయులు హాజరై జ్యోతి ప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇ రామాంజనేయులు మాట్లాడుతూ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న వారు కూడా క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారి చర్యలతో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యం. నిరంజన్ బాబు మాట్లాడుతూ వివిధ కారణాలతో యువత ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారని, జీవిత కాలం హాయిగా ఉందామనుకునే వారిని పిల్లల చావులు మరింత కృంగదీస్తున్నాయని కష్టాలను ధైర్యంగా ఎదుర్కొవాలని పేర్కొన్నారు. ఈ అనగాహన కార్యక్రమంలోకళాశాల విద్యార్థిని విద్యార్థులు, బోధన సిబ్బంది, కోఆర్డినేటర్ వి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



ఎస్ఐని సన్మానించిన సెవెన్ హిల్స్ ఫాం కళాశాల సిబ్బంది